డా॥ మల్లెమాల వేణుగోపాల్ రెడ్డి

# కాలప్రవాహంలో

వారం రోజులకు పైగా పట్టి కుండపోతగా వర్షం... చెరువులు, కాలువలూ పొంగి పొర్లిపోయాయి. కుందూ నది ప్రవాహం, పెన్న పరవళ్లు పత్రికలు ప్రచురించాయి.

ఎంత రొచ్చయినా, రొంపయినా ఆఫీసుకు మాత్రం వెళ్లక తప్పదు గదా! టౌన్‌లో కొంపలకి అద్దె యిచ్చుకోలేక నాలుగు కిలోమీటర్ల దూరంలో కుసలవాని పల్లెలో కాపురం వుంటున్నాను. పిక్కబలం మీద నమ్మకంతో సైకిలున్నదనే ధైర్యంతోనే దూరమైనా పల్లెబాట పట్టాను. నా పొదుపు ఉద్యమంలో భాగంగా రామనాథం కూడా పల్లెలోనే యిల్లు తీసుకున్నాడు.

వర్షంలో యింటి నుండి ఆటోలతో తిరిగితే ఇంకేముంది. యింట్లో అన్నీ నిండుకుంటాయి. అందుకే వర్షంలోనూ మాకు సైకిళ్లే వాహనాలు. కాకపోతే రెయిన్ కోటూ, గొడుగూ తోడు. రామనాథం నా సహోద్యోగి. శంకరాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం.

ఇద్దరం ప్రొద్దున్నే వాహనాలెక్కి కాళ్లకు సత్తువ జూపించి టౌను చేరడం, సబ్ స్టేషన్‌లో రణగొణ ధ్వనులకూ, పని భారానికి అలసట పడి, అలవాటుపడి, గానుగెద్దులా తిరిగి యిల్లు చేరడం రోజువారీ చాకిరీతో మా నౌకరీ ముడి పడింది.

బాగా పొద్దుపోయింది. వర్షం పడుతూనే ఉంది. ఒక చేత్తో గొడుగు, రెండో చేత్తో సైకిల్ స్టీరింగూ... చిలకల బావి దాటి రోడ్డున పడ్డాం నేనూ, రామనాథం. చిట్టచీకటి... చెట్లూ, పుట్టా దెయ్యాల్లా కనిపిస్తున్నాయి. సైకిల్ లైట్ల వెలుతురులో దారి కనిపిస్తున్నది. వర్షం పెద్ద జల్లు కొట్టినప్పుడల్లా సైకిలూ గొడుగూ మాతో పాటు సర్కస్ ఫీట్లు చేస్తున్నాయి. హైవే నాలుగు రోడ్ల జంక్షన్ దాటి, రోడ్డు మలుపు తిరిగాము. గప్పున ముక్కులు పగిలిపోయేంత దుర్గంధం, ఊపిరి పీల్చడానికి కూడా ఉక్కిరి బిక్కిరిగా వుంది. భరించరానంత దుర్వాసన.

“ఛ! ఛ! ఏం వాసనరా యిది!” రోడ్డెక్కుతూ అన్నాడు రామనాథం.

“కుక్కచచ్చిపడుంటుంది... ముక్కు మూసుకొని పద” అన్నాను.

నాకేమైనా చతుర్భుజాలున్నాయేం! ఏ చెత్తో ముక్కుమూసుకోమంటావు” ఎక్కిరింపుగా అన్నాడు రామనాథం.

నా తెలివితక్కువతనానికి నాకే సిగ్గేసింది.

గూటికి చేరి భోంచేశానే గానీ కడుపులో కెళ్లిస్తూనే ఉండి, రాత్రంతా నిద్రలేదు. తెల్లవారి వాన తెరిపించింది. మళ్లీ వాహనాల మీద తయారయ్యాం రౌతులిద్దరం.

ముందునాటి సాయంత్రంపు దుర్గంధపు స్థలానికి చేరుకోగానే భళ్లున వాంతి జేసుకున్నాడు రామనాథం. నాకూ అదే ఫీలింగ్. సైకిళ్లు ఆపి మోరీ ప్రక్కన నిలిపి, కెనాల్ వైపు తేరిపారజూసాం. గుండె ఆగిపోయేంతటి భయంకరమైన దృశ్యం... గున్న ఏనుగు లాంటి మనిషి శవం. ఆడా మగా తేడా తెలియనంతగా శరీరం ఉబ్బిపోయి వుంది కళ్లూ, ముఖం రాక్షస రూపందాల్చి వికృతంగా వుంది. కాలువలో

పారే నీటిలో తేలుతూ మోరీకి అడ్డంగా జమ్మి కొమ్మ అడ్డుపడింది. ఆ కొమ్మ అడ్డుతగిలి శవం తూము గుండా పోలేక నిలిచిపోయింది.

ఆ దృశ్యం నన్నూ, రామనాథాన్నీ కలవర పెట్టింది. మా సైకిళ్లకు తాళం వేయించింది. మా కాళ్లను కట్టి పడేసింది. మనకెందుకని చూసి వెళ్లేందుకు వీలు లేకుండా పాపభీతి బంధం వేసింది. మానవత వెన్ను తట్టింది.

"ఏందయ్యా అట్టాచూస్తూ నిలబడ్డారు" కూరగాయల గంప సైకిల్ మీద పెట్టుకుని పోతూ ఆగి అడిగాడు మార్కెట్టు సుబ్బారాయుడు. చాకలి మునెయ్య గుడ్డల మూటతో వచ్చిన సైకిల్ ఆగింది. పాలక్యానుతో వచ్చిన చెన్నయ్య టి.వి.ఎస్.కీ బ్రేకు పడింది. పెరుగు తట్ట నెత్తిన పెట్టుకుని వచ్చిన సాలమ్మ ఆగిపోయింది. పొట్ట బండి వీరాస్వామి ఎద్దుల్ని



కట్టేసాడు. నుదుటి నామాలతో పేటంచు పంచె, కండువా వేసుకొని, పెండ్లి పౌరాహిత్యానికి ఆటోలో పోతున్న పూజారి పాపన్నపంతులు ఆటో ఆపి దిగాడు. అంతా మూగిపోయారు. ఎవరికివారే ఆ దృశ్యాన్ని చూసి అవాక్కయ్యారు. సాలమ్మ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అంది "ఓవురోగానీ జనమ కడ తేర్చుకున్నాడో! కడతేర్చినారో?"

వీరాస్వామి అందుకున్నాడు "ఆత్యహత్య అయివుండదు. అందుకు ఎన్నో మార్గాలుండగా కాలవలో పడి చచ్చేవారెవరుంటారు. ఎవరో చంపి కాలువలో పడేసి వుంటారు" అన్నాడు.

ఎలాగైతేనేమిటి చచ్చాడు గదా! చచ్చి వాడేమో బ్రతికిపొయ్యాడు, మనల్ని చంపి కూర్చున్నాడు. ఇప్పుడేమిటి చేయడం?" అప్పుడే వచ్చి సిద్ధాంతి కర్మకాండను గురించి విచారం వ్యక్తం చేశాడు. ముక్కుమూసుకుని "ఏమిటి చేసేది... పట్టండయ్యా పట్టండి... అందరం కలిసి ముందర శవాన్ని బైట పడేద్దాం... దిగండయ్యా వీరాస్వామి, మునయ్యా, సుబ్బరాయుడూ తలొక చెయ్యివెయ్యండి" ప్యాంటు పైకెగబట్టి అన్నాడు. "నువ్వేమన్నా తెలివి వుండే మాట్లాడుతున్నావా? అన్‌క్లైమ్‌డ్ బాడీస్ మనం తాకడానికి వీల్లేదు... పంచనామా జరిపించి పోస్టుమార్టం చెయ్యందే శవాన్ని యితరులు ముట్టుకోరాదు" రామనాథం అన్నాడు. రామనాథానికి పాప భీతేకాదు, లోక భీతి కూడా వుంది. "ఛీ! ఛీ! ఎవడంటే వాడు శవాన్ని తాకడమే! ఆ పనికి వెట్టివాళ్లున్నారు. ఇంతలాంటి రాక్షస శవాన్ని మీరంతా కలిసినా ఒడ్డుకు తేగలరా?" అని మైలపడతాననే భయంతో ఆటో స్టార్టు చేయించి వెళ్లిపోయాడు పూజారి పాపన్నపంతులు.

"మీరందరూ ఎందుకింత హైరానా పడుతున్నారు. ఇదేమైనా ప్రాణాలు పోయే ఎమర్జెన్సీనా! చట్టం దానంతట అదే చేసుకుపోతుంది" బండి ఆపి, సలహా యిచ్చి బండెక్కి వెళ్లిపోయాడు కాలేజి లెక్చరర్.

"చట్టం మాట తరువాత... సమయం, సందర్భం అక్కర్లేదా? ముందు శవాన్ని పైకి లాగండయ్యా!" సర్వం హెచ్చించి అన్నాను. "మీకేం పిచ్చా! చాదస్తమా! ముందు మునసబుకు, కరణమయ్యకూ చెప్పిరండి. వెట్టివాళ్ల చేత వాళ్లే శవాన్ని వెలికితీయిస్తారు. ఆ తరువాత తలభారం ఎలా దించుకోవాలో వాళ్లే ఆలోచించుకుంటారు" బట్టలకొట్టు బలరామయ్య అన్నాడు.

"మునసబూ, కరణం ఏం చేస్తారు? అయ్యా మీరు సైకిల్‌పై వెళ్లి పోలీసు స్టేషన్‌లో రిపోర్టివ్వండి. వాళ్లే చూసుకుంటారు" చాకలి మునెయ్య చెప్పాడు.

"మనకెందుకిదంతా! ఆ జమ్మి కొమ్మను తప్పిస్తే శవం కాలువలో కొట్టుకుపోతుంది... ఆ విషయం ఈ గుంపు చూసుకోలేరా!" సైకిలెక్కి అన్నాడు రామనాథం.

"నేను రాను! శవాన్ని అలా వదిలేసి వెళ్లిపోవడానికి నా మనస్సు ఒప్పుకోవడం లేదు" అన్నాను.

"అయితే రిపోర్టిచ్చి, పోలీసు స్టేషన్‌కూ, కోర్టుకూ సాక్ష్యానికి తిరుగు... నీ కర్మ" సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిపోయాడు రామనాథం.

"పదండయ్యా పదండి! ఆ కొమ్మ తప్పిద్దాం!! పోస్టు జవాను గంగయ్య పూనుకుంటూ అన్నాడు.

"అలా చెయ్యడానికి వీల్లేదు. నేను వెళ్లి మునసుబుని, కరణాన్ని తీసుకొస్తాను... ఆ శవాన్ని ఏమీ చేయకండి" అని సైకిలెక్కి వెనుదిరిగి కుసలవాని పల్లె మనసబు ఇంటికి చేరాను. కరణమూ అక్కడే కొలువుతీరి ఉన్నాడు.

"మున్సబుగారూ! మీరు వెంటనే రావాలి.

హైవేలో కె.సి. కెనాల్ కాలువలో మోరీకడ్డంగా ఒక శవం తేలి ఉంది. చెట్టుకొమ్మ అడ్డం పడ డంతో శవం యిరుక్కుపోయింది. దాన్ని బయ టకు తీయించాలి" సైకిల్ వేగంగా తొక్కడంతో ఆయాసంతో రొప్పుతూ అన్నాను.

"అది మాదాకా వచ్చింది సారూ! ఆ విష యమే మాట్టాడుకుంటున్నాం. ఆ ఏరియా నబీ కోట క్రిందికి వస్తుంది. వాళ్లే ఏమైనా చేయాలి" చుట్ట కాలుస్తూనే అన్నాడు మున్సబు.

"శవాన్ని వెట్టివాళ్లతో ముందుపైకి తీయిం చండి. ఆ తరువాత మిగతా విషయాలు తేల్చు కోవచ్చు" నెమ్మదిగానే అన్నాను.

"ఇదిగో సార్! మనకెందుకు చెప్పండి. దారినబోయే దానయ్యలను గురించి, ఏట్లో కొట్టుకుపోయే శవాన్ని గురించి. కాసేపు ముక్కు మూసుకుని మోరీ దాటిపొండి" చుట్టుతీసి ఉమ్మి వేస్తూ అన్నాడు మున్సబు.

"ఆ మాత్రం బాధ్యత పౌరులమైన మనం దరి మీద ఉంది" మాటలు తడబడకుండా అన్నాను. నాటక ఫక్కీ తప్పలేదు.

"సరే సార్! ఎలాగూ మీరు టౌన్ వెళు తున్నారు గదా! అక్కడ పోలీస్ స్టేషన్‌లో రిపో ర్టిచ్చి పొండి. అంతా వాళ్లే చూసుకుంటారు. మనకెందుకొచ్చిన పీడ యిది" కరణం జందెం రుద్దుకుంటూ అని, నన్ను పట్టించుకోకుండా లేచి వెళ్లారు వాళ్లిద్దరూ.

"వీళ్లేం మనుషులు...? వీళ్లకంటే నక్కలూ గ్రద్దలూ నయం. ఏమీ మిగల్చకుండా పొట్టన బెట్టుకుని చూసేవాళ్ల సంక్షోభానికి కొంత తెర వేస్తాయి. వీళ్లు పశవులకంటే హీనజాతి" నాలో నేను గొణుక్కుంటూ సైకిలెక్కాను.

దారిలో ఆలోచనలు... "తటస్థులు. ఎవడే గంగలో కలిస్తే మాకేమనుకునే తటస్థులు... కాదు... చాదస్తులు... మడీ, తడీ అని మొలకు మడి గట్టుకుని, ముక్కు బిగబట్టి దాటిపోయే రకం. లేదు... పిరికివాళ్లు... తాము అనుకున్న గోడని, తన వెంట నడిచే నీడనీ చూసి భయపడి పారిపోయే రకం".

తిరిగి మోరీ దగ్గరకు చేరాను. అక్కడ చేరిన జనం అంతా వెళ్లిపోయారు. హైవేలో పోతున్న బస్ ఆపి, ప్రయాణికులంతా కిటికీల నుండి తొంగిచూసి "డ్రైవర్! ఆగకుండా పోనీ... ఇప్ప టికి రెండు గంటలు ఆలస్యం చేసావు" అన్నా రు. బస్ బయలుదేరింది.

నేను సైకిలెక్కి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ చేరు కున్నాను. సెంట్రీ టీ త్రాగుతున్నాడు. సిగరెట్ పీలుస్తూఉన్నాడు. విషయమంతా వివరించాను.

"ఆ ఏరియా మా జూరిస్‌డిక్షన్‌లో లేదు సార్! మీరు వెళ్లి రూరల్ స్టేషన్‌లో రిపోర్టి వ్వండి... వాళ్లు చూసుకుంటారు" టీ గ్లాసుని చల్లారుస్తూ టీ చప్పరిస్తూ అన్నాడు.

"గత్యంతరం లేక రూరల్ పోలీస్ స్టేషన్‌కెళ్లి కంప్లయింట్ వ్రాసియిచ్చాను. "మీరు త్వరగా అక్కడికెళ్లండి" కానిస్టేబుల్‌తో అన్నాను.

"మా ఇన్‌స్పెక్టర్‌గారు పెండ్లిమర్రిలో కాపుర ముంటున్నారు. ఆయన పదకొండు గంటలకు స్టేషన్ కొస్తారు. ఈ రోజు వాళ్లింట్లో వ్రతం వుంది. ఇంకా కొంచెం ఆలస్యమైనా కావచ్చు... వచ్చిన తర్వాత మీ కంప్లయింట్ చూపిస్తాము". కంప్లయింట్ టేబుల్ మీద పెట్టి గేటువైపు నడి చాడు. "మీరిక వెళ్లవచ్చు అని నోటితో చెప్పకుం డానే సూచన చేసాడు. ఆఫీస్ టైమ్ అయింది... తిన్నగా ఆఫీసు చేరాను. రామనాథం ద్వారా అప్పటికే మా ఎ.ఇ. విషయం తెలుసుకుని నా ఆలస్యానికి ప్రశ్నించకుండా "పోయి నీ పని చూసుకో" అన్నాడు.

ఏ ఫైలు తిరగేసినా ఆ శవం కన్పించసాగింది... నా మెదడు ఆలోచనల కార్ఖానాగా మారింది. ఆదిశంకరుల వాక్యాలు గుర్తుకొచ్చాయి. "యావత్‌పవనోనివసతిగేహో! తావత్ పృచ్ఛతి కుశలంగేహే! గతివతివాయో దేహాపాయో! భార్యాభిభ్యతితస్మిన్ కాయే!" పుస్తకం తీసి తాత్పర్యం చదివాను.

"దేహంలో శ్వాస వున్నంతసేపూ పరివారమంతా కుతూహలపడతారు... శ్వాస వదిలిపోయిన తరువాత చివరికి భార్య కూడా ఏకాంతంలో శవం ప్రక్కన కూర్చోవడానికి భయపడుతుంది". ఆయనే చెప్పిన ఇంకో వాక్యం "సంసారోయమ తీవ్ర విచిత్రం" అంతేనన్నమాట, వేదాంతంతో సరిపుచ్చుకోవాలన్నమాట.

తెచ్చుకున్న టిఫిన్ బాక్స్‌లోని పెరుగన్నం సహించలేదు. నీళ్లు త్రాగి లేచి ఎ.ఇ. గారి వద్ద పర్మిషన్ తీసుకుని యింటిదారి పట్టాను. చిలకలబావి దాటినప్పటి నుంచి నాకు ముచ్చెమటలు పోయసాగాయి. సైకిల్ త్రొక్కడానికి కూడా కాళ్లలో సత్తువలేదు. మళ్లీ మోరీ వద్ద ఆ శవాన్ని చూసి భరించేటంత ఆత్మస్థయిర్యం నాలో లేదు. ఏకాకినైపోయాను.

"ఇంకేది దారి?" అదే దారి... సైకిల్ నెట్టుకుంటూ మోరీ వద్దకు చేరాను. జనం గుంపులు కూడి చూస్తున్నారు. శవం అక్కడే, అలాగే వుంది. దుర్వాసన అధికమైంది.

"రావులపల్లి మాలెంకణ్ణి ఎవరో చంపేశారట. వాడి శవం కనిపించడంలేదట" ఎవరో అన్నారు.

"మాలెంకణ్ణి ఎవరో కత్తిపోట్లతో చంపారట. ఏదీ శవం మీద కత్తిపోట్లు లేవే", "అసలు శవం ఆడో, మగో తెలియడంలేదు జుట్టు పెద్దదిగానే వుంది" ఇంకో గొంతు.

"మాలెంకడు కూడా జుట్టుపోలుగాడే గదా" "ఆ! వాడైవుండడు. వీడెవడో ఆకలిబాధ భరించలేక కాలవలో దూకి చచ్చి ఉంటాడు." రకరకాల వ్యాఖ్యానాలు వినపడ్డాయి.

"పోలీసులు రాలేదా!" అడిగాను.

"వాళ్లెక్కడొస్తారు సార్! ఇట్లాంటి గిట్టుబాటు లేని కేసులను టౌనులో ఎవరూ పట్టించుకోరు" అన్నదొక గొంతు. గుర్తుపట్టాను – అతను తపాలా బంట్రోతు.

"చావు బతుకుల్లో ఉన్నవాళ్లను గురించే పట్టించుకోరు. ఇంక చచ్చిన వాళ్లను గురించి, అనాథ శవాలను గురించి పట్టించుకుంటారా?" ఇంకో గొంతు.

జీపు వచ్చి ఆగింది. పట్టణంలోని ప్రముఖ రాజకీయవేత్త జీపు దిగకుండానే "డ్రైవర్! ఏందిరా ఆ గుంపు" అన్నాడు. డ్రైవర్ దిగి కాలవ వైపు చూసి "ఏదో శవం కాలువలో కొట్టుకొచ్చింది సార్! జనం గుంపుకట్టారు."

"సరే! సరే! నువ్వు పోనీ! నాకు పార్టీ మీటింగు ఉంది. యిట్టా మాటిమాటికీ ఆగుతూపోతే లేటవుద్ది". డ్రైవర్ జీపు స్టార్ట్ చేశాడు. జీపు దూసుకుపోయింది. నాకు పిచ్చిపట్టినట్టయింది.

మళ్లీ సైకిలెక్కి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరాను. ఇన్‌స్పెక్టర్‌ని చూడడానికి కానిస్టేబుల్ అడ్డుచెపుతూ "మీరు మళ్లీ వచ్చారెందుకు? ఇన్‌స్పెక్టర్‌గారిప్పుడే వచ్చారు. మీ కంప్లయింట్ చూసారు. యాక్షన్ తీసుకుంటారు. మీరు వెళ్లిపోండి" అన్నాడు. నేను లెక్కచేయకుండా లోపలికెళ్లి ఇన్‌స్పెక్టర్‌కి పరిచయం చేసుకొని విషయం వల్లించాను. కొంచెం ఆవేశం ఊగింది.

ఇన్‌స్పెక్టర్ చిరునవ్వుతో "చూడు మిస్టర్! మాకు ప్రొద్దున లేచింది మొదలు ఇలాంటి కేసులే. అయినా యిది ఇప్పుడు ఏమంత ప్రాణం పోయే ఎమర్జెన్సీ అని నువ్వు ఆవేశపడుతున్నా

వు" అన్నాడు వ్యంగంగా... అధికార దర్పంగా.

"ప్రాణానికి చట్టం రక్షణ కల్పించింది. ప్రాణం పోయిన తరువాత కూడా జరగవలసిన తంతుకూ చట్టం బాధ్యత వహిస్తుంది. ఒక అన్‌క్లైమ్‌డ్ శవానికి చట్టరీత్యా చర్య తీసుకోవాలి... కాకపోయినా ఆ శవం ఎంత పబ్లిక్ న్యూసెన్స్‌గా తయారైందో వచ్చి చూడండి" అన్నాను.

"ఆల్‌రైట్! యూకెన్‌గో! వుయ్ విల్ లుక్ ఇన్‌టుదట్" లేచి గేటుదాటి పోలీస్ జీపెక్కాడు... నేను మోరీ దగ్గరకు చేరేటప్పటికి ఇన్‌స్పెక్టరు అక్కడకు చేరి వెట్టివాళ్లను పిలిపించి శవాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయిస్తున్నాడు... నేను దీర్ఘంగా శ్వాసపీల్చుకున్నాను... శ్వాసలో ఆత్మ తృప్తిచెందిన అనుభవం.

శవం బయటపడింది. మగవాడి శవం. కుడి చెంపన రూపాయి వెడల్పు పుట్టుమచ్చ. చేతి వ్రేలికి పచ్చరాళ్ల ఉంగరం, ఎర్రచారల నిక్కరు శవాన్ని పోల్చుకోవడానికి ఆనవాలు దొరికాయి. పోలీసులు శవాన్ని పోస్ట్‌మార్టంకు పంపారు. ప్రొద్దుపోయింది. ఇక మర్నాడే పోస్టుమార్టమ్.

మర్నాడు సాయంత్రం నాలుగు గంటలకు నేనూ, రామనాథం పని ముగించుకుని ఆఫీసు నుండి బయల్దేరి రోడ్డెక్కాము. రోడ్డు ట్రాఫిక్ జామ్ అయివుంది. ఒక లారీ నిండా పూలతో అలంకరించిన టాప్‌మీద, పాడెమీద శవం, శవం నిండా పూలు కప్పేసారు. మేళతాళాలతో ఊరేగింపు సాగుతోంది. పురప్రముఖులంతా లారీ వెనుక నడుస్తున్నారు. రాజకీయవేత్తలు కార్లతో వెనుక ఊరేగుతున్నారు. నిన్నటి జీపు రాజకీయవేత్త కూడా ఆ వెంటవున్నాడు... పోలీస్ ఇన్‌స్పెక్టర్ జీపు వెనక నడుస్తున్నాడు.

నాలుగురోడ్ల కూడలి దాటి శవ ఊరేగింపు స్మశానం వైపు వెళ్లింది. ట్రాఫిక్ ఓపెన్ అయింది.

"మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రామస్వామి కొడుకు సురేష్‌ని దువ్వూరులో కక్షదారులు ఖూనీ చేసి, శవాన్ని కాలవలో పారేసారట. రామస్వామికి కబురులేదు. వ్యాపార నిమిత్తం దువ్వూరు వెళ్లిన కొడుకు తిరిగి వస్తాడనుకున్నాడు... నిన్న సురేష్ శవం కె.సి.కెనాల్‌లో తేలిందట. పోలీసులు అలెర్టు అయి వెంటనే యాక్షన్ తీసుకుని, పంచనామా జరిపించి, పోస్ట్‌మార్టం జరిపించారు. శవాన్ని రామస్వామి కుటుంబ సభ్యులు గుర్తుపట్టారు. వెంటనే శవసంస్కారం జరిపించి స్మశానానికి పోతున్నారు" జనంలో నుండి వినిపించిన వార్తలు. పోలీసుల సామర్థ్యానికి ప్రజల నుంచి వచ్చిన కితాబుకి... నాకూ. రామనాధానికీ ఆశ్చర్యం వేసింది.

ఇంతకూ ఆ శవం మాలెంకడిది కాదు. అయివుంటే యిలా ఊరేగేదా? మునిసిపల్ బండిలో కూరుకునిపోయి, మట్టిలో కలిసిపోయేదే. ఆలోచిస్తున్నాను... కాలం ఎంత మారిపోయింది...? చిన్ననాటి నా స్మృతులు... మా ఊళ్లో శవం ఉంటే ఊరు ఊరంతా కదలివచ్చి, విషాదఛాయల్తో శవసంస్కారం జరిపించి, అంతిమక్రియల వరకూ ఆ కుటుంబానికి సహాయ సహకారాలందించేవారు. ఆఫ్‌కోర్స్! ఇక్కడా సురేష్ శవమూ ఊరేగింపుగా సాగిపోయింది. కాకపోతే మాలెంకడి శవం ఎక్కడ తేలిందో... కాలప్రవాహంలో ఎన్ని అంతరాలు... మౌనంగా నడుస్తున్నాను... ఆలోచనలసుడుల్లో...

"ఇంకా ఏమిటీ ఆలోచన? శవం ఊరేగింపు దాటిపోయింది. నువ్వెందుకు ఆ శవాన్ని నీ ఆలోచనల్లో మోసుకువస్తున్నావింకా" అన్నాడు రామనాధం. అది మరచిపోయే ఘట్టమా...? కక్షల దొంతరలో ఇంకెన్ని శవాలో... ●